క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్‌లలో రాష్ట్రానికి అన్యాయం



పొన్నూరు: బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెడుతోన్న బడ్జెట్‌లో గత పదేళ్లుగా రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టేందుకు అంకెల గారడి చేస్తుందని పొన్నూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఇకనైనా బీజేపీ రాష్ట్రానికి మేలు చేసే దిశగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం పార్లమెంటులో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్, 2014 నుంచి నేటి వరకు ఇది 11వ బడ్జెట్ అని, అన్ని బడ్జెట్‌లలో రాష్ట్రానికి బీజేపీ ఇచ్చింది శూన్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజషన్ యాక్ట్ ప్రకారం రాష్ట్రానికి రూ.15 లక్షల కోట్లు అవసరం ఉండగా అది నేడు రూ.20 లక్షల కోట్లకు చేరిందని, కేంద్రం ప్రకటించిన రూ.15 వేల కోట్లు ఏ మూలకు వస్తాయో వారే తెలపాలని ప్రశ్నించారు. అంకెలతో మభ్యపెట్టకుండా, కేవలం ఆంధ్రప్రదేశ్ ఎంపీలతో మూడోసారి అధికారంలోకి వచ్చామన్న కృతజ్ఞతతో బీజేపీ వ్యవహరించాలని తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు



గుంటూరు రూరల్: యువతి అదృశ్యంపై నల్లపాడు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్జీవో కాలనీ, 12వ లైను నల్లకుంటకు చెందిన రేపూడి సుమ ఈ నెల 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తండ్రి రేపూడి ఎలీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. యువతికి 20 సంవత్సరాలు ఉంటాయని, మతి స్థిమితం లేదని ఆచూకి తెలిసిన వారు నల్లపాడు పోలీస్ స్టేషన్ 8688831376, 8688831590 సెల్ నంబర్లకు తెలియజేయవచ్చన్నారు.

కలుపు మందుల అమ్మకాలు నిలిపివేత




కొరిటెపాడు(గుంటూరు): సంగడిగుంటలోని లాంచస్టర్ రోడ్‌లో గల పల్నాడు పార్శిల్ సర్వీసులో గుంటూరు అర్బన్ వ్యవసాయ అధికారులు బి.గౌతం ప్రసన్న, ఒ.సునీల్‌లు మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేకుండా హైదరాబాదు నుంచి వస్తున్న రూ24,000 విలువ గల 150 లీటర్ల గ్లైసైల్ పురుగు మందుల(కలుపు మందు)ను స్వాధీనం చేసుకుని అమ్మకాలు నిలిపివేశారు. ఈ సందర్భంగా ఏఓలు మాట్లాడుతూ అనుమతులు లేకుండా విత్తనాలు, పురుగు మందులు రవాణా చేయడం నేరమన్నారు. సరైన పత్రాలు లేని కారణంగా స్వాధీనం చేసుకుని అమ్మకాలు నిలిపివేశామన్నారు. ఈ కలుపు మందుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్య

నగరంపాలెం: గాలి పంకాకు ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాలరెడ్డినగర్ ఏడో వీధి పీవీఆర్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో శ్రీహరిబాబు (55), ఆయన భార్య భాగ్యలక్ష్మీ ఉంటారు. వారికి అరండల్‌పేట ఐదో వీధిలో చెప్పుల దుకాణం ఉండగా, కోవిడ్-19 నుంచి దుకాణంలో రూ.25 లక్షల ఖరీదు చేసే సరుకు నిల్వ ఉంది. దీంతో కొద్ది నెలలుగా శ్రీహరిబాబు ఆరోగ్యం సరిగా లేక విజయవాడలో ఓ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నారు. సోమవారం అతని భార్య బంధువుల ఇళ్లకు వెళ్లింది. మంగళవారం భార్య భర్త ఫోన్‌కు చేయగా, లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆమె అనుమానం వచ్చి ఫ్లాట్‌లోని తెలిసిన వారికి ఫోన్ చేసింది. ఫ్లాట్‌కు తాళం వేసినట్లు చెప్పారు. ఇక ఆమె ఫ్లాట్ వద్దకు చేరుకుని తాళం తీయగా భర్త పంచెతో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించగా విలపించింది. ఈమేరకు అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని జీజీహెచ్ శవాగారానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అముక్తమాల్యదపై ఆధ్యాత్మిక ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం అముక్తమాల్యదపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. డాక్టర్ శ్రీరంగ నాయకి మాట్లాడుతూ యామునాచార్యుడు తన కుమారునకు బోధించిన రాజనీతిలో రాజుగా కృష్ణ దేవరాయల సొంత గొంతుక వినిపిస్తుందని అన్నారు. ఈ రాజనీతి విభాగం సంక్లిష్టమైన నిర్మాణంతో పలు సంప్రదాయాల మేలు కలయికగా కనిపిస్తుందని వివరించారు.

ఉత్తుత్తి సభలు.. ఊకదంపుడు ఉపన్యాసాలు



యనమదలలో పద్నాలుగు మందితో నిర్వహిస్తున్న గ్రామ సభ



తుమ్మలపాలెం సచివాలయం లోపల వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులను కూర్చోబెట్టి నిర్వహిస్తున్న గ్రామ సభ

- హర్‌ఘర్ జల్, ఓడీఎఫ్ ప్లస్ గ్రామ సభలపై యంత్రాంగం నిర్లక్ష్యం
- ప్రచారం లేక, జనం రాక సభలు వెలవెల
- గత్యంతరం లేక ప్రభుత్వ ఉద్యోగులను కూర్చోబెట్టి మమ అనిపిస్తున్న వైనం

ప్రత్తిపాడు: గ్రామ సభల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అత్యంత కీలకమైన గ్రామ సభలను నామమాత్రంగా జరిపి చేతులు దులిపేసుకుంటున్నారు. హర్ ఘర్ జల్, ఓడీఎఫ్ (బహిరంగ మల విసర్జన రహిత) ప్లస్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హత ఉన్న లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఈ నెల 23వ తేదీ నుండి 26 వరకు గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తొలిరోజు మండలంలోని యనమదల, తుమ్మలపాలెం, ఈదులపాలెం, గనికపూడి గ్రామాల్లో గ్రామ సభలు జరిపేందుకు షెడ్యూల్ ఇచ్చారు.

పద్నాలుగు మంది.. పది నిమిషాలు

మండల పరిధిలోని యనమదల గ్రామంలో ఇన్‌చార్జి కార్యదర్శి ఆధ్వర్యంలో స్థానిక గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ గొడ్డుగోరు ఆదినారాయణ అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. సభకు సంబంధించి వివరాలను ముందస్తుగా గ్రామస్తులకు తెలియజేయడం గానీ, దండోరా వేయించడం గానీ చెయ్యకపోవడంతో సభ జరుగుతుందన్న విషయం స్థానికులకు తెలియని పరిస్థితి చోటుచేసుకుంది. అధికారులు కార్యాలయం ఎదుట టెంటు, కుర్చీలు వేసినప్పటికీ ఫలితం లేకపోయింది. గ్రామస్తులు కేవలం పద్నాలుగు మందే రావడంతో వారికి సెక్రటరీ ఎ.శ్రీదేవి హర్‌ఘర్ జల్, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై నాలుగు మాటలు చెప్పి పదే పది నిమిషాల్లో ముగించేశారు.

నాలుగు గోడల మధ్య అధికారులను కూర్చోబెట్టి..

తుమ్మలపాలెంలో అయితే అత్యంతకీలకమైన గ్రామ సభను నాలుగు గోడల మధ్య జరిపి మమ అనిపించేశారు. వాస్తవానికి గ్రామ సభను పంచాయతీ కార్యాలయం బయట అందరికీ కనిపించేలా షామియానా, కుర్చీలు వేసి బహిరంగంగా జరపాల్సి ఉంది. కానీ ఇందుకు పూర్తి విరుద్ధంగా గ్రామ సచివాలయం లోపల అన్ని శాఖల ఉద్యోగులు, సచివాలయ సిబ్బందిని కూర్చోబెట్టి వారికి పై రెండు అంశాలపై ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. గ్రామస్తులు కేవలం ఆరుగురంటే ఆరుగురే ఉన్నారు. గ్రామ సర్పంచ్ చల్లా నాగమల్లేశ్వరి అధ్యక్షత వహించారు. ఇక ఈదులపాలెంలో అయితే ఉదయం జరగాల్సిన సభను సాయంత్రానికి వాయిదా వేశామని అధికారులు చెప్పారు.

పత్తాలేని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ప్రజలు, గ్రామ సభల నిర్వహణ సంగతి అలా ఉంచితే, సభల్లో ప్రజలకు అజెండా అంశాలపై వివరించాల్సిన అధికారులు కూడా డుమ్మా కొట్టేశారు. అజెండా అంశమైన హర్ ఘర్ జల్‌పై ప్రజలకు వివరించాలంటే సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సభకు హాజరు కావలసి ఉంది. కానీ ఆయన జాడ లేకపోవడంతో ఉన్న సిబ్బందే పథకానికి సంబంధించి ప్రజలు లేవనెత్తిన సమస్యలకు వారికి తెలిసిన సమాధానాలు చెప్పి బయటపడ్డారు.

గ్రామ సభకు అత్యంత ప్రాధాన్యం

గ్రామసభ.. పంచాయతీరాజ్ చట్టంలో గ్రామ సభలది అత్యంత ప్రాధాన్యత ఉన్న అంశం. వాస్తవానికి గ్రామ సభలు సక్రమంగా, సజావుగా జరిగితే గ్రామ దశ, దిశను మార్చగలవు. వికేంద్రీకృత ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామసభ పునాదిలాంటిది. ఆర్టికల్ 243ఏ ప్రకారం రాజ్యాంగ బద్ధమైనది కూడా. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే నేరుగా పాలుపంచుకునే ఏకైక వేదిక. అభివృద్ధి పనుల ఎంపిక, పథకాలకు లబ్ధిదారుల ఎంపిక.. వంటి అనేక అంశాలను ఈ సభల్లో చర్చిస్తారు. ఇంతటి కీలకమైన గ్రామ సభను గ్రామ పంచాయతీలో జరపాలంటే అజెండా నోటీసును రెండు రోజుల ముందు ప్రకటించడంతో పాటు గ్రామంలో దండోరా వేయడం, ముఖ్య కూడళ్లలో నోటీసులు అంటించడం, నోటీసు బోర్డులపై అంటించడం, కనీసం ఐదు రోజుల ముందు తెలియజేయాల్సి ఉంటుంది. కానీ ఇవేమీ చెయ్యకుండా సభలను జరుపుతుండటంతో అవి వెలవెలబోతున్నాయి.

నాలుగు గోడల మధ్య గ్రామ సభలు జరపకూడదు

నాలుగు గోడల మధ్య గ్రామ సభలు జరపకూడదు. బహిరంగంగా టెంట్లు, కుర్చీలు వేసి ప్రజలు కూర్చునే విధంగా గ్రామ సభలు జరపాలి. ఇప్పటికే సెక్రటరీలకు స్పష్టంగా వివరించాం. మరోసారి గదుల్లో గ్రామ సభలు జరగకుండా ఆదేశాలిస్తాం. గ్రామ సభలకు ప్రజలు హాజరయ్యేలా వారికి విస్తృత అవగాహన కల్పించాలి.

-కె.దుర్గాప్రసాద్, ఎంపీడీవో, ప్రత్తిపాడు

బీసీజీ వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేయాలి

గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్

ప్రత్తిపాడు: బీసీజీ వ్యాక్సిన్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఏఎన్ఎంలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరి యునిస్ మాట్లాడుతూ గ్రామాల్లో మధుమేహం ఉన్న వారికి, ధూమపానం చేసే వారిని, 60 సంవత్సరాలు పైబడిన వారిని గుర్తించి వారికి బీసీజీ వ్యాక్సిన్ వేయాలన్నారు. అదే విధంగా కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రతి ఇంటికీ ఆశా కార్యకర్త వెళ్లి సర్వే చేయాలన్నారు. అనుమానితుల వివరాలను ఏఎన్ఎంలకు తెలియజేయాలని చెప్పారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లలో ఎలాంటి అలసత్వాన్ని వహించవద్దని, ప్రతి యాంటినేటల్‌కు నాలుగు సార్లు పరీక్షలు చేయించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీహెచ్ఈవో చెల్లమ్మ, పీహెచ్ఎన్ నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ఉన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయించరాదు



ఎరువుల దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి

కాకుమాను: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయించాలని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. మండల కేంద్రం కాకుమానులో మంగళవారం ఎరువులు, విత్తన దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్‌లో దుకాణ యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి దుకాణంలో ధరల పట్టికను ఏర్పాటు చేయడంతో పాటు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే రైతులు స్థానిక వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆమె తెలిపారు. దుకాణాలలో ఉన్న స్టాకు వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో కె.కిరణ్మయి, సిబ్బంది ఉన్నారు.

ప్రతిభ చాటిన విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు



అర్హత సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్ : ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తోందని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. మంగళవారం పెదపలకలూరులోని కళాశాలలో లియోరా డిజిటల్ అమిగోస్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ నైపుణ్యత కలిగిన విద్యా విధానం, ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో తమ కళాశాల విద్యార్థులు ఉపాధి పొందగలుగుతున్నారన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి గోపాలకృష్ణ, ఇన్‌చార్జి రామిరెడ్డిలు మాట్లాడుతూ లియోగా డిజిటల్ అమిగోస్ సంస్థలో ఇంటర్న్‌షిప్ కోసం ప్రతిభ కలిగిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను సంస్థ డైరెక్టర్ జె.బోయస్‌రాజు, ఆపరేషన్స్ మేనేజర్ షేక్ ఇమ్రాన్, పాలిశెట్టి శేషసాయి, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

జగ్జీవన్‌రామ్ చైర్ అభివృద్ధికి కృషి

ఏఎన్‌యూ: యూనివర్సిటీలోని బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని నూతన డైరెక్టర్ ఆచార్య పొన్నెకంటి జోసఫ్ రత్నాకర్ తెలిపారు. బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా నియమితులైన ఆయన గత కోఆర్డినేటర్ ఆచార్య కె.మధుబాబు నుంచి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. యూనివర్సిటీ దూర విద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పూలే, అంబేడ్కర్ అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు ఆచార్య త్రిమూర్తిరావు, ఆచార్య అశోక్ కుమార్‌లు నూతన డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య రత్నాకర్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఏర్పాటు చేసిన లక్ష్యాల సాధనకు ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తానన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలు, లక్ష్యాలపై విస్తృతంగా పరిశోధనలు జరిపించడంతో పాటు, ఆయన జీవిత ఘట్టాలు, అణగారిన వర్గాలకు చేసిన సేవలను సమాజానికి చేరువ చేస్తానని తెలిపారు. ఢిల్లీలోని బాబూ జగ్జీవన్‌రామ్ ఫౌండేషన్‌ను సంప్రదించి అధ్యయన కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి.కోటేశ్వరరావు, పలువురు పరిశోధక, విద్యార్థి సంఘ నాయకులు, సిబ్బంది నూతన డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రత్తిపాడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.దుర్గాప్రసాద్ తెలిపారు. ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చర్చించడం జరుగుతుందని చెప్పారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం

ప్రత్తిపాడు: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక కేటాయింపులు చెయ్యడం హర్షణీయమని బీజేపీ సీనియర్ నాయకుడు జంధ్యాల వేంకట రామలింగేశ్వర శాస్త్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించటంపై జంధ్యాల హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయించడంతో పాటు, వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు నిధులతో పాటు వెనుకబడిన ఏడు జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించటాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జీప్యాట్-2024లో హిందూ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఎం.ఫార్మసీలో ప్రవేశానికై జాతీయ స్థాయిలో నిర్వహించిన జీప్యాట్-2024 ఫలితాల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీప్యాట్-2024 ప్రవేశ పరీక్షకు తమ కళాశాల నుంచి హాజరైన 30 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని, వీరు ప్రముఖ విశ్వ విద్యాలయాలతో పాటు నైపర్‌లో తమకు నచ్చిన బ్రాంచ్‌లో ఎం.ఫార్మసీలో చేరేందుకు అర్హత పొందారని వివరించారు. షేక్ అఫ్రిన్ బేగం 3,186వ ర్యాంకు, బి.సంధ్యారాణి 8,213వ ర్యాంకు, ఏ. చెన్నకేశవ 10,745వ ర్యాంకు, బి. లక్ష్మీ శ్రావణి 11,213వ ర్యాంకు సాధించారని తెలిపారు. జీప్యాట్ ద్వారా ఎం.ఫార్మసీ చదివే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు మంజూరు చేస్తుందని, ఎం.ఫార్మసీ పూర్తయిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, జీప్యాట్ కోచింగ్ ఇన్‌చార్జ్ సీహెచ్ ప్రసాదరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఎ.ప్రత్యూష, అధ్యాపకులు అభినందించారు.

సైనికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు



లక్ష్మీపురం: విద్యార్థులలో నైపుణ్యతను వెలికి తీసేందుకు ప్రధానంగా ఆర్మీ జవానుల కుటుంబాలలో పదోతరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందజేయడం జరిగిందని ఎన్‌సీసీ కల్నల్ సజల్ కాంతిదాస్ అన్నారు. స్థానిక శ్యామలానగర్ ఎన్‌సీసీ కార్యాలయంలో మంగళవారం స్కాలర్ షిప్‌ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ సైనికుల పిల్లల్లో నూతన ఉత్తేజం, ఉత్సాహం కల్పించేందుకు ఈ స్కాలర్ షిప్‌లను అందజేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఈ ఏడాది 142 మంది విద్యార్థులకు ఈ ప్రతిభ పురస్కారాలను అందచేసినట్లు ఆయన చెప్పారు. పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభకనబర్చిన సైనికుల పిల్లలకు ప్రతి విద్యార్థికి రూ.5 వేలు అందజేశామని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రతిభ కనబర్చిన ప్రతి ఒక్కరికీ ప్రతిభా పురస్కారాలను అందజేసేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు.

నేడు, రేపు ఆర్‌వీఆర్‌జేసీలో స్పేస్ ఎగ్జిబిషన్



కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్

గుంటూరు రూరల్: ఇస్రో ఆధ్వర్యంలో ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలలో భాగంగా ఈ నెల 24, 25 తేదీలలో స్పేస్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్పేస్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి షార్ శాస్త్రవేత్తలు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరవుతున్నారన్నారు. చంద్రయాన్ 3 చరిత్రాత్మక విజయం పురస్కరించుకొని భారత ప్రభుత్వం ఇస్రో, శ్రీహరికోట సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నేతృత్వంలో కళాశాలల సహకారంతో నిర్వహించనున్న తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు తమ కళాశాలలో నిర్వహించటం సంతోషకరమన్నారు. ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేనిలు మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో ముఖ్య అతిథిగా షార్ శ్రీహరికోట సైంటిస్ట్ డైరెక్టర్ ఏ రాజరాజన్, గౌరవ అతిథిగా ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహనరావు, విశిష్ట అతిథిగా షార్ డిప్యూటీ డైరెక్టర్ టీఎస్ రఘురాం, ఇస్రో శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. ఇస్రో నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలలో ఎంపిక చేసిన ప్రాంతాలలో తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎగ్జిబిషన్ కన్వీనర్ డాక్టర్ జి.రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో ఈవీ ఇండస్ట్రీలో మిలియన్ ఉద్యోగాలు

ఎన్ఐటీ ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సందీప్



విజ్ఞాన్ లారాలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్ఐటీ ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సందీప్

చేబ్రోలు: భవిష్యత్‌లో ఈవీ (ఎలక్ట్రిక్ వెహికల్) ఇండస్ట్రీలో మిలియన్ ఉద్యోగాలు క్రియేట్ చేయబడతాయని ఎన్ఐటీ ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వీ సందీప్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజనీరింగ్ కళాశాలలో 'విద్యుదీకరణ చలనశీలత: ఎలక్ట్రిక్ వాహనాలతో భవిష్యత్‌ను రూపొందించడం' అనే అంశంపై మూడు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ సందీప్ మాట్లాడుతూ భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వెహికల్స్‌దేనన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగాలలో విద్యార్థులకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఎలక్ట్రిక్ వెహికల్స్‌లో వినియోగించే టెక్నాలజీల మీద పట్టు సాధించినట్లయితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో హైడ్రోజన్‌తో పనిచేసే వాహనాలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రాబోవు 50 సంవత్సరాలలో విద్యుత్ వాహనాలకు సంబంధించి మరింత సాంకేతికత అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రిన్సిపాల్ ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే విద్యార్థులపై దృష్టి పెట్టాలి

ఎంఈవో సీహెచ్ రమాదేవి



విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు రమాదేవి, లీలారాణి

ప్రత్తిపాడు: ప్రాథమిక పాఠశాల దశ నుంచే విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్‌లో చదవడం, రాయడం నేర్పించాలని ఎంఈవో సీహెచ్ రమాదేవి అన్నారు. మండల పరిధిలోని కొండేపాడు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈవో సీహెచ్ రమాదేవి, ఎంఈవో-2 లీలారాణిలు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను సబ్జెక్టుల వారీగా పరీక్షించారు. విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించారు. ఈ సందర్భంగా ఎంఈవో రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ నైపుణ్యం సాధించేలా ప్రైమరీ లెవల్ నుంచే ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో రాజీపడకుండా నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని హెచ్ఎం చంద్రశేఖర్ రెడ్డికి సూచించారు.

కిట్స్‌లో మెరిసిన 'అలనాటి రామచంద్రుడు'



కిట్స్‌లో సందడి చేసిన 'అలనాటి రామచంద్రుడు' చిత్ర యూనిట్

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం అలనాటి రామచంద్రుడు చిత్ర యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా హీరో కృష్ణవంశీ, హీరోయిన్ మోక్ష, డైరెక్టర్ ఆకాష్‌రెడ్డిలు కళాశాలలో పర్యటించారు. విద్యార్థులతో సరదాగా కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా హీరో, హీరోయిన్‌లు మాట్లాడుతూ ఒక మధ్య తరగతి కుటుంబ నేపథ్యంలో తెరకెక్కించిన ఈ సినిమా అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందన్నారు. ఆగస్టు 2వ తేదీన విడుదల కానున్న సినిమాను ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ కొత్త కథాంశాలతో వచ్చే సినిమాలతో పాటు నూతన నటీనటులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ హరిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం వల్లే వ్యాధుల తీవ్రత

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు నగరంలోను పారిశుద్ధ్యం క్షీణించి డయేరియా, డెంగీ, మలేరియా లాంటి విష జ్వరాలు ప్రబలి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో నగర సీపీఐ పార్టీ సమితి సభ్యుల విస్తృత సమావేశం నగర కార్యవర్గ సభ్యురాలు గుండెబోయిన లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకి అనేకసార్లు మొరపెట్టుకున్నా ఫలితం కాన రాలేదని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి పైన అపరిష్కృతంగా ఉన్న సమస్యల పైన దృష్టి పెట్టాలన్నారు. అందుకు స్థానికంగా ఉన్న పార్టీ శాఖలు కదలి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ ఉన్న ప్రతి ప్రాంతంలో ప్రజా సమస్యలు ఉత్పన్నమైన వాటి పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో మోడీ ప్రభుత్వం అత్యంత ప్రమాదకరంగా మారిందని, మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు జరుపుతూ దేశ సౌభ్రాతృత్వానికే ప్రమాదం వాటిల్లే విధానాలను అమలు జరుపుతున్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా జరిగే పోరులో సీపీఐ నాయకులు, కార్యకర్తలు విరోచిత పాత్ర నిర్వహించాలన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ గుంటూరు నగర సమగ్ర అభివృద్ధి కోసం నగరంలోని పార్టీ శాఖలన్నీ పోరాట కార్యక్రమాలకు సిద్ధం కావాలని, నగరంలోని శాఖలన్నీ క్రియాశీలంగా పనిచేయాలన్నారు.